

## గంజాయి గుప్పిట్లో బోయనపల్లె!

కడప–రేణిగుంట హైవేపై ఉన్న బోయనపల్లె గంజాయి గుప్పిట్లో గుప్పుమంటోంది. పలువురు యువకులు గంజాయి మత్తులో ఘర్షణలకు దిగుతున్నారు. - 8లో



## చిన్నారులపై విరుచుకుపడిన సైకో

కురబలకోట ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులపై సైకోగా మారిన మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఉన్నట్టుండి విరుచుకు పడ్డాడు. - 8లో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.190 | రూ.240 |
| రెండోరకం | రూ.110 | రూ.180 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 294 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 430 | 430 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 70.482 కిలోలు

# మొండిచేయి!






ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు కూటమి ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపింది. ఇక్కడి ప్రజల, రైతుల ప్రయోజనాలను విస్మరించింది. రబీకి ప్రీమియం రైతులే చెల్లించుకోవాలని తేల్చి చెప్పింది. మెట్ట ప్రాంత రైతులకు ప్రయోజనకారిగా నిలుస్తున్న జలసిరి పథకానికి అరకొర నిధులు కేటాయించింది. నిరుద్యోగ యువతకు శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించాలనే సంకల్పం కొరవడింది. కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం నిర్మించదలిచిన రాజోలి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది.

- రైతులపై సవతి తల్లి ప్రేమ
- మెట్ట రైతులకు యోగ్యకరమైన జలసిరికి నిధుల కొరత
- నిరుద్యోగులకు లభించని ప్రాధాన్యత
- ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు
- ఎన్నికల హామీలు అమలుకు కేటాయింపులు నిల్
- మమ అన్పించిన ఎన్‌డీఏ కూటమి సర్కార్ బడ్జెట్



**జిల్లా ప్రాజెక్టులు బడ్జెట్‌లో కేటాయింపులు (రూ.కోట్లల్లో)**

| ప్రాజెక్టు | కేటాయింపు |
|---|---|
| తెలుగుగంగ | 422.00 |
| గాలేరు-నగరి | 2,254.08 |
| పులివెందుల కాలువ | 305.38 |
| వెలిగొండ | 393.49 |
| హంద్రీ-నీవా | 867.75 |
| కేసీ కెనాల్ | 253.10 |
| ఎస్సార్బీసీ | 44.32 |

సాక్షి ప్రతినిధి, కడప: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌ను (2024–2025) సోమవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.2.94 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ఉన్నత విద్యకు, నిరుద్యోగ యువత ఉపాధి కల్పన కోసం పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత దక్కలేదు.

ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తగా పరిశ్రమలను స్థాపించి వాటి ద్వారా సంపద సృష్టిస్తానని ప్రకటిస్తూ వచ్చారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన కోసం బడ్జెట్‌లో ప్రాధాన్యత లోపించిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష కడప ఉక్కు పరిశ్రమకు బడ్జెట్‌లో కేటాయింపులు చెయ్యకపోవటం జిల్లాపై నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరో వైపు ఎన్నికల హామీ నెరవేర్చే ప్రక్రియ రాష్ట్ర బడ్జెట్‌లో కన్పించలేదు. ప్రతి మహిళకు రూ.18వేలు ఊసేలేదు. నిరుద్యోగ భృతి గురించి యోచనే లేదు. ఉచిత బస్సు ప్రయాణానికి కేటాయింపుల్లేవు. ఇక తల్లికి వందనానికి అరకొర నిధులేనని.. సూపర్ సిక్స్ హామీలకు తగిన బడ్జెట్ కేటాయింపుల్లేవని పలువురు మండిపడుతున్నారు.

**సంఖ్య కన్పిస్తున్నా అవసరాలకు అరకొర నిధులే**

జీఎన్ఎస్ఎస్‌లో భాగంగా గండికోట, సర్వారాయసాగర్, వామికొండ రిజర్వాయర్లు పూర్తి అయ్యా యి. వాటి పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ కేటాయింపులు రూ.2,254 ఉన్నా, పెండింగ్ బిల్లులు రూ.1400 కోట్లు ఉన్నాయి. తక్కిన నిధులు నామమాత్రమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు భూసేకరణ, నిర్మాణానికి తగిన స్థాయిలో నిధులు లభించలేదనే నిపుణులు వివరిస్తున్నారు. మొత్తంగా పరిశీలిస్తే చంద్రబాబు సర్కార్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పై సవతి తల్లి ప్రేమ చూపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అన్నమయ్యకు అన్యాయం**

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నమయ్య జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టుకుగానీ అభివృద్ధి పనులకు గానీ ఒక్క పైసా నిధులు విదల్చకపోవడం తీవ్ర నిరాశను మిగిల్చింది. కొత్తగా ఏర్పాటైన జిల్లాపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కక్ష సాధింపే బాబు వైఖరి అని పలువురు పేర్కొంటున్నారు.

**రాజోలికి నిధులు నిల్...**

కేసీకెనాల్‌కు ఆయువుపట్టు రాజోలి రిజర్వాయర్. జిల్లాలో 95వేల ఎకరాలు స్థిరీకరణకు ఉపయోగపడ్డ ఈ రిజర్వాయర్‌కు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.225కోట్లు కేటాయించింది. ప్రస్తుత కూటమి సర్కార్ బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు అస్సల్లేవు. వెరసి కేసీ కెనాల్ ఆయకట్టుదారులకు ఆశనిపాతంగా మారింది. జిల్లాలో అతిపెద్ద ఆయకట్టు ఉన్న కేసీ కెనాల్ స్థిరీకరణ చోటు చేసుకుంటే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు, కడప నియోజకవర్గాల రైతులకు ఎంతో ప్రయోజనం లభించేది. అలాంటి ప్రాజెక్టును చంద్రబాబు సర్కార్ విస్మరించడం గమనార్హం. మెట్టప్రాంత రైతులకు ఎంతో ఉపయోగమైన జలసిరి పథకానికి కేవలం రూ.50కోట్లు కేటాయించి మమ అన్పించారు. గ్రేటర్ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఉచిత బోర్లు ఉపయోగం. నిధులు కేటాయింపులో అరకొరగా చూపి మెట్ట రైతులకు అన్యాయం చేశారని పలువురు వాపోతున్నారు.

**అంతా మోసమే**



రాష్ట్ర అసెంబ్లీలో కూటమి బడ్జెట్ అంతా మోసమే. ఈ బడ్జెట్ ప్రతి ఒక్కరిని నిరాశపరిచింది. బడ్జెట్‌లో సూపర్‌సిక్స్‌కు కేటాయింపులు కనిపించలేదు. పథకాలకు కేటాయింపు లేకుండానే రూ.41వేల కోట్లు ఎక్కువ చూపిస్తున్నారు. ప్రజలను మాటల గారడీతో బురిడీ కొట్టించే విధంగా బడ్జెట్ ఉంది. ఇది అబద్ధాల బడ్జెట్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మహిళలను నిట్టనిలువునా మోసం చేసింది.
– ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

**బాబు గారడీ**



బడ్జెట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారడి స్పష్టంగా కనిపించింది. సూపర్‌సిక్స్‌కు మొండిచెయ్యి. చంద్రబాబు ప్రభుత్వం హామీలకు మంగళం పాడింది. బడ్జెట్‌లో తేలిగ్గా అబద్ధాలు చెప్పారు. చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. రైతుకు కూటమి బడ్జెట్ షాక్ ఇచ్చింది. బడ్జెట్‌లో అనేక పథకాలు కానరాలేదు. కూటమి సర్కారు నిజ స్వరూపం బయటపడింది.
–పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

**పథకాలకు సరిపడే నిధులు కేటాయించలేదు**



ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించి పథకాలకు సరిపోయే విధంగా నిధులు కేటాయించలేదు. కూటమి బడ్జెట్ ప్రజల్లో అభాసుపాలైంది. సూపర్‌సిక్స్‌కు నిధుల కేటాయింపు చూస్తుంటే అమలు అనుమానమే. కూటమి బడ్జెట్‌పై ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాశలు అయ్యా యి. కేటాయింపులు దారుణంగా ఉన్నాయి.
–మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

**ఆత్మస్తుతి, పరనింద**



కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన చేయకపోగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయింది. బడ్జెట్ పూర్తి రాజకీయ పత్రంగా ఉంది. –పి.శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శి

**పేదలకు ఒరిగింది శూన్యం**



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రంలోని పేదలకు ఒరిగింది శూన్యం. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు, సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కేవలం మాటల ప్రభుత్వంగా నిరూపితమైంది. సూపర్ సిక్స్ హామీల పేరుతో ఓట్లు దండుకొని అధికారం చేపట్టాక నిధులు కేటాయించకుండా ఎలా అమలు చేస్తారు. ప్రజలు చంద్రబాబు నిజ స్వరూపం తెలుసుకోవాలి.
–కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

**మాటల గారడీ**



అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మాటల గారడిని తలపించింది. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిధుల కేటాయింపులో అన్యాయం చేశారు. పంటల బీమా స్వచ్ఛంద నమోదు అనే ఆకర్షణీయ మాటల వెనుక ఇప్పటి వరకు ఉచిత బీమా ఇకపై రైతు ప్రీమియం చెల్లిస్తేనే అమలవుతుందన్న విషయాన్ని దాచిపెట్టడం అన్నదాతను మభ్యపెట్టడమే అవుతుంది.
–ఆర్.రమేష్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

**చేతులెత్తేసిన ప్రభుత్వం**



ఎలాంటి పథకాలు అమలు చేయకుండానే, గత ప్రభుత్వం కంటే రూ.41వేల కోట్లు ఎక్కువ ఖర్చు పెట్టేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఎందుకో అర్థం కావడం లేదు. అమరావతి కోసం పెట్టే రూ.15వేల కోట్ల ఖర్చు రుణమా? గ్రాంటా? క్లారిటీ ఇవ్వలేదు. మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం పథకం అమలుపై స్పష్టంగా పేర్కొన కుండా తొలి బడ్జెట్‌లోనే చేతులెత్తేసింది. –నిసార్‌అహ్మద్, మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

## న్యూస్‌రీల్

### ముగిసిన స్కూల్ గేమ్స్



ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జిల్లా జట్టు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 68వ స్కూల్ గేమ్స్ సోమవారం ముగిశాయి. హ్యాండ్ బాల్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానం, ఉమ్మడి కడప జిల్లా ద్వితీయస్థానం, పశ్చిమగోదావరి జిల్లా మూడోస్థానం దక్కించుకున్నట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ శారద తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులను అభినందించి మెమెంటోలు అందజేశారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


బావుద్దీన్


సోని


భానుచంద్

రాజంపేట టౌన్: బాల్‌బ్యాడ్మింటన్ సీనియర్స్ విభాగంలో రాజంపేట పట్టణానికి చెందిన ఎస్.బావుద్దీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జి.వెంకటరమణ సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. అలాగే రాజంపేట పట్టణానికి చెందిన సోని, దువ్వూరుకు చెందిన జె.భానుచంద్ ఫెడరేషన్ కప్ ప్రాబబుల్స్ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నంద్యాలలో జరిగిన అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు ప్రతిభ చాటి జాతీయ ప్రాబబుల్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

### ఉత్సాహంగా ఆర్మీ సెలక్షన్స్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ రెండోరోజూ సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అభ్యర్థులకు రిజిస్ట్రేషన్, పరుగు పందెం, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, హైజంప్, లాంగ్‌జంప్, పుల్ అప్స్ టెస్టులు నిర్వహించారు. సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ఈవెంట్ అయిన పోయిన వెంటనే అభ్యర్థులకు ఇంక్‌మార్క్ ఉంచారు. అనంతరం ఫిజికల్ టెస్టులు పూర్తయిన అభ్యర్థులకు మెడికల్ టెస్టులు నిర్వహించారు. ఎంపికల ప్రక్రియను ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు ఆజాద్

**జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్**



మైనార్టీలకు సేవలు అందించిన వారిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్

రాయచోటి: భారతదేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో భారతరత్న, దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని జిల్లా మైనార్టీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూజీసి, ఐఐటీ, ఐఐఎంల స్థాపనలో ఆజాద్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అనంతరం అన్నమయ్య జిల్లాలో మైనార్టీలకు విశేష సేవలు అందించిన షాకీర్ తదితరులకు మెమెంటోలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, మైనార్టీ శాఖ సిబ్బంది, జిల్లాలోని మైనార్టీల నాయకులు, మైనార్టీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**

దేశ నిర్మాణంలో కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికై న ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో అన్నమయ్య జిల్లాలోని వివిధ కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన సీఆర్‌టీలు, ప్రధానోపాధ్యాయులు, పార్ట్ టైం ఉపాధ్యాయులకు నియామకపత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కృషి, ప్రోత్సాహం ద్వారా యువత సరైన మార్గంలో నడుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ కేజీబీవీ, మోడల్ పాఠశాలలకు 30 మంది ఉపాధ్యాయులను మెరిట్ ఆధారంగా, పారదర్శకంగా నియామకాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా ప్రజా సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని కలెక్టర్ తెలిపారు. అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**జియో ట్యాగింగ్‌లో పురోగతి సాధించాలి**

ప్రభుత్వ ఇళ్లకు జియో ట్యాగింగ్‌లో పురోగతి సాధించాలని, అలాగే విద్యార్థులకు త్వరితగతిన ఆధార్ జనరేట్ చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీఓలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ పీజీఆర్ఎస్, ఎన్టీఆర్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వీరభద్రుడిని దర్శించుకున్న కలెక్టర్**

రాయచోటి టౌన్: రాయచోటిలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామిని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతం వీరి పేరున వినాయకుడికి, అఘోర లింగేశ్వరుడికి, వీరభద్ర స్వామికి, భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణయ్యస్వామి, శేఖర్ స్వామి, రాచరాయ యోగీ స్వామి, మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ఆలయ విశిష్టతను, స్థల పురాణాన్ని వివరించారు.

## లఖ్‌పతి దీదీ.. ఏదీ!

- రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణం ఉత్తిదే
- పథకం ప్రారంభించి 15 నెలలు పూర్తి
- జిల్లాలో ఎక్కడా అమలు కాని వైనం
- మహిళల ఎదురుచూపు



సమావేశమైన స్వయం సహాయక సంఘ సభ్యులు

గాలివీడు: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చి వారు స్వయం ఉపాధి పొందేలా 2023 ఆగస్టు 15న 'లఖ్‌పతి దీదీ యోజన'ను మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఈ పథకం అమలుకు కొన్ని నిధులు కూడా బడ్జెట్‌లో కేటాయిస్తున్నట్లు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ 2024 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఈ పథకం ద్వారా 3 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని కూడా చెప్పారు. పేదరిక నిర్మూలన, స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఏడాదికి లక్ష రూపాయలకు పైగా సంపాదించేలా స్వయం ఉపాధికి అవకాశం కల్పిస్తారు. వీరికి వడ్డీ లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తారు. ఇంతటి బృహత్తర పథకం జిల్లాలో ఇప్పటిదాకా అమలుకు నోచుకోలేదు.

**లఖ్‌పతి దీదీ యోజనకు అర్హతలు**

- ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళ కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదు.
- స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండాలి.
- ప్రభుత్వ ఉద్యోగి లేదా ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా అర్హులు కాదు.
- 18 నుంచి 50 ఏళ్ల లోపు వయసు మహిళలు మాత్రమే అర్హులు.
- ఇక్కడ శాశ్వత నివాసి అయి ఉండాలి.

**దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు**

లఖ్‌పతి దీదీ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, స్వయం సహాయక సంఘంలో ఉన్నట్లు సభ్యత్వ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వయసు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మొబైల్ నంబర్ ఉండాలి. వీటిని తీసుకుని డీఆర్డీఏ శాఖకు చెందిన మండల ఏపీఓను సంప్రదిస్తే సరిపోతుంది.

**లఖ్‌పతి దీదీ ప్రయోజనాలు**




ఈ పథకం ద్వారా ఎంపికైన మహిళలకు ఎల్ఈడీ లైట్ల తయారీ, ప్లంబింగ్, పుట్టగొడుగుల పెంపకం, కుట్టు మిషన్ల మరమ్మతులు, పశుపోషణ, డ్రోన్ల మరమ్మతు వంటి వాటిపై తగిన శిక్షణ ఇప్పిస్తారు. వ్యవసాయ రంగానికి మరింత సాంకేతికత జోడించేందుకు ఈ రోజుల్లో డ్రోన్ల ఉపయోగమేంటో అందరికీ తెలిసిందే. పంటలకు నీటిపారుదల, మందుల పిచికారీకి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ పథకం ద్వారా వర్క్‌షాపులు, రుణ సౌకర్యాలు, బీమా కవరేజ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్థిక ప్రోత్సాహకాలు వంటి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయి.

**జిల్లా వివరాలు**

| | |
|---|---|
| మండలాలు | 30 |
| వీఓలు | 1048 |
| స్వయం సహాయక సంఘాలు | 10,008 |
| స్వయం సహాయక సభ్యులు | 311553 |

**ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం**



లఖ్‌పతి దీదీ పథకం ద్వారా రూ.5 లక్షలు వరకూ వడ్డీలేని రుణాలు తీసుకోవడానికి ఎంతో మంది డ్వాక్రా మహిళలు ఎదురు చూస్తున్నారు. ఈ పథకానికి నిధులు రాలేదని అధికారులు చెబుతున్నారు. మోదీ మహిళలను లక్షాధికారులను చేస్తామంటే సంతోషించాం. ఇప్పటిదాకా ఒక్కరిని కూడా లక్షాధికారిని చేసింది లేదు. వెంటనే ఈ పథకం అమలు చేయాలి. – రమణమ్మ, గాలివీడు.

**జీవనోపాధి లక్ష్యంగా చర్యలు**



స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతతో పాటు జీవనోపాధుల కల్పనే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకం ద్వారా మహిళలకు శిక్షణ అందించి, రుణాలు అందించేలా చూస్తాం. అయితే ఈ పథకానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. రాగానే మహిళలను లక్షాధికారులను చేసేందుకు మా వంతు పాత్ర పోషిస్తాం.
–సత్యనారాయణ, మెప్మా పీడీ

## వైఎస్సార్‌సీపీ నాయకులను విడుదల చేయాలి

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి**



రాయచోటి: రాయచోటి మండలం గుంటిమడుగుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణారెడ్డి, ఇతర కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటిలో ఈమేరకు పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. టీడీపీ నాయకులకు మద్దతుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు గుంటిమడుగులో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్ల ముందు ఫ్లెక్సీలు పెట్టారన్నారు. వాటిని అదే పార్టీకి చెందిన మరో వర్గం వారు చించేశారన్నారు. ఇలా ఆ పార్టీకి చెందిన వారే పరస్పరం ఫ్లెక్సీలు చించుకుని గొడవలకు దిగారన్నారు. ఈ సంఘటనతో సంబంధంలేని రమణారెడ్డిని పోలీసులు ఆదివారం రాత్రంతా పోలీసు స్టేషన్‌లో నిర్బంధిచడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ విషయంపై తాను విజయవాడ నుంచి ఎస్‌ఐ నరసింహారెడ్డికి అనేకసార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదన్నారు. గౌరవ ప్రదంగా వ్యవసాయం చేసుకునే రమణారెడ్డి, అమరనాథ్‌రెడ్డి మరికొంతమంది దళిత యువకులను అక్రమంగా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడమే కాకుండా వారిని సీఐ చంద్రశేఖర్ దారుణంగా కొట్టారన్నారు. పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన మహిళలపై లాఠీచార్జి చేయడం దారుణమన్నారు. పోలీసుల చర్యలను చట్టప్రకారం ఎదుర్కొంటామన్నారు.

## క్లుప్తంగా

### జాతీయ జట్టుకు ఎంపిక

గాలివీడు : నేషనల్ వాలీబాల్ జట్టుకు గాలివీడులో వీఆర్ఏగా పని చేస్తున్న కరిమిరెడ్డిగారిపల్లి నివాసి చీకటి సురేష్ కుమార్ కుమారుడు చీకటి జస్వంత్ ఎంపికయ్యాడు. విజయవాడలో గత రెండు రోజులుగా జరుగుతున్న నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడు. ఇతను కడపలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

### 'విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి మహాప్రభో'

గాలివీడు : 'మా ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి మహాప్రభో' అని ఓ కుటుంబం వేడుకుంటోంది. వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు పట్టణానికి కూతవేటు దూరంలో రాయచోటి–కదిరి ప్రధాన రహదారిపై గ్యాస్ గోడౌన్ పక్కనే నివాసం వుంటున్న వెంకటలక్ష్మమ్మ, గురునాథ దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2001లో ఎంతో శ్రమించి ఒక పక్కా గృహాన్ని నిర్మించుకున్నారు. అయితే సరిపడా ఆర్థిక వనరులు లేకపోవడంతో గోడలు, పైకప్పు పూర్తి చేసుకుని అందులో నివాసముంటున్నారు. ఇదే క్రమంలో విద్యుత్ కనెక్షన్ కోసం పలుమార్లు విద్యుత్ సిబ్బందిని సంప్రదించారు. రెండు దశాబ్దాల కాలం గడిచి పోయినప్పటికీ విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. తన నివాసం నుంచి కేవలం మూడు వందల మీటర్ల దూరంలో సబ్‌స్టేషన్, విద్యుత్ కార్యాలయం ఉన్నప్పటికీ తమకు విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇవ్వడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిశీలిస్తాం : ఆ ప్రదేశాన్ని పరిశీలించి విద్యుత్ స్థంభాలు ఎన్ని నాటించాలో డీఈ కె.విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆ గృహానికి విద్యుత్ అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

# గంజాయి గుప్పిట్లో బోయనపల్లె!

మారుమూల ప్రాంతాలకు సైతం చాప కింద నీరులా గంజాయి విస్తరిస్తోంది. ప్రస్తుత సమాజంలో మత్తును తీసుకోవడం యువత ట్రెండ్‌గా భావిస్తోంది. ఈ మత్తు చౌకగా దొరికే గంజాయితో ప్రారంభమై.. హెరాయిన్, కొకైన్ వైపు దారితీస్తోంది. గంజాయి దుష్పరిణామాలు తీవ్రరూపం దాల్చిన తర్వాతే తల్లిదండ్రులు గుర్తించడం, అప్పటికే పరిస్థితి చేయిదాటుతోంది.


కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని న్యూబోయనపల్లె


మూతపడిన మన్నూరు సబ్‌కంట్రోల్ రూం

- మత్తులో జోగుతున్న విద్యార్థులు
- తలెత్తుతున్న అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలు

రాజంపేట : కడప-రేణిగుంట హైవే వెంట ఉన్న బోయనపల్లె ప్రాంతం గంజాయి గుప్పిట్లో గుప్పుమంటోంది. కడప-రేణిగుంట హైవేలో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ విద్యాసంస్థలు ఉండటంతో.. ఇతర జిల్లాలకు చెందిన అనేక మంది యువతి, యువకులు ఉన్నారు. ఇటీవల గంజాయి మత్తులో రెండు వర్గాలు ఘర్షణ పడిన సంగతి తెలిసిందే. గంజాయి బోయనపల్లెకు దిగుమతి అవుతోందన్న విషయం పోలీసు శాఖకు కూడా తెలిసినప్పటికీ.. అడ్డుకట్టవేయలేని స్థితిలో ఉన్నారని విమర్శలున్నాయి.

### గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు

న్యూబోయనపల్లెలో గంజాయి అమ్మకాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి. కొంత మంది కడప నుంచి గంజాయిని బోయనపల్లెకు చేరుస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్యాకెట్ల రూపంలో అమ్మకాలు కొనసాగుతున్నాయి. రూ.350, రూ.450, రూ.550లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. యువతను అధికంగా ఆకర్షించే విధంగా ఒక ప్రముఖ టీషాపులో గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం.

### మూతపడిన సబ్‌కంట్రోల్

న్యూబోయనపల్లెలో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉంటుంది. అలాగే ట్రాఫిక్ కూడా ఉంటుంది. గతంలో ఇక్కడ సబ్ కంట్రోల్ ఉండేది, ఇప్పుడు లేదు. మూతపడింది. ఈ పరిస్థితిలో యువకుల బృందాల స్వైర విహారం చేస్తున్నాయి. బర్త్‌డే పార్టీలని, మరొక పార్టీలంటూ యువకులు పెద్దఎత్తున కేకలు, ఈలలు వేస్తూ బోయనపల్లెను దద్దరిల్లిస్తున్నారు. రాత్రివేళలో యువకుల వల్ల స్థానిక నివాసీయులు ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి వరకు బర్త్‌డే సెలబ్రేషన్, టపాసులు పేల్చడం లాంటి వినోదాలను బహిరంగం గానే చేస్తూ.. బోయనపల్లె వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. అటు మద్యం, ఇటు గంజాయి మత్తులో యువత వీరంగం సృష్టిస్తోంది. గంజాయి బ్యాచ్‌లో గొడవలకు దిగారు. పోలీసుల వరకు వెళ్లింది.

### కొరవడిన గస్తీ

న్యూ బోయనపల్లె విషయంలో గస్తీ కొరవడిందనే చెప్పవచ్చు. బోయనపల్లెలో మద్యం మత్తులో యువకుల జోరును స్థానిక ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మద్యం తాగి యువకులు అల్లరి చేస్తున్నారు. అల్లర్ల దెబ్బకు తట్టుకోలేక స్థానిక మహిళలు ఇళ్ల ముందు పరదాలు, డోర్‌కటన్స్ వేసుకొని బయటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. అల్లరి యువకులను ఇటీవల ప్రశ్నిస్తే వారికి పైకి తిరగబడ్డారు. దీంతో చేసేదేమిలేక మహిళలో ఇళ్లలోని నుంచి బయటికి రాలేక బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. పోలీసులు అల్లరిమూకల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని వారుకోరుతున్నారు. రాత్రివేళలో వీధులలో అల్లరి మూకల స్వైర విహారురాన్ని అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని మహిళలు విన్నవిస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో అత్తిరాలలో గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి రెండవ కార్తీక సోమవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. అత్తిరాల పరిసరాలలో శివనామస్మరణం హోరెత్తింది. కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామికి నూతనంగా తయారు చేయించిన ఉత్సవ విగ్రహాలను రథంలో కొలువు దీర్చారు. స్వామి వారి రథాన్ని భక్తులు లాగుతూ భక్తి గీతాలు ఆలపిస్తూ చేపట్టిన ఈ ప్రదక్షిణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో కొనసాగింది. భక్తులకు గిరి ప్రదక్షిణ భక్త మండలి ఆధ్వర్యంలో ప్రతినిధులు అన్నప్రసాదం అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు సిద్దా లింగారెడ్డి, కార్యదర్శి పోకల ప్రభాకర్, కోశాధికారి వై.నందకిషోర్‌గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు

గిరి ప్రదక్షిణలో కొలువు దీర్చేందుకు నూతనంగా దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను రూ.1.20 లక్షలతో మేడా బాలకృష్ణారెడ్డి దంపతులు తయారు చేయించి వితరణ చేశారు. ఈ విగ్రహాలకు ఉదయం పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. కాగా గత పౌర్ణమికి సిద్దా లింగారెడ్డి దంపతులు రూ.1.90 లక్షలతో గిరి ప్రదక్షిణ కోసం రథాన్ని తయారు చేయించారు.


కల్యాణ వేదికపై కొలువు దీరిన కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి

### కనుల పండువగా కల్యాణం

శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి అత్తిరాలలో గిరి ప్రదక్షిణ కమిటీ ప్రతినిధులు కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. దేవస్థాన పురోహితులు పద్మనాభశాస్త్రి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిపించారు.

# చిన్నారులపై విరుచుకుపడిన సైకో


కురబలకోట కాలనీలో గుమికూడిన జనం


బాధితులను విచారణ చేస్తున్న ముదివేడు ఎస్ఐ

- భయంతో వణికిన విద్యార్థినులు
- ఉలిక్కిపడిన కురబలకోట
- పోలీసులకు అప్పగించిన కాలనీ వాసులు


సైకోగా ప్రవర్తించిన నరసింహారెడ్డి

కురబలకోట : మండల కేంద్రం కురబలకోట ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులపై సైకోగా మారిన మతిస్థిమితం లేని ఓ వ్యక్తి సోమవారం ఉన్నట్టుండి విరుచుకు పడ్డాడు. ఐదుగురి విద్యార్థినులపై దాడి చేశారు. వారు కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని సైకో బారి నుంచి రక్షించారు. అదృష్టవశాత్తు విద్యార్థినులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, కాలనీ వాసుల కథనం మేరకు.. కురబలకోట ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ కాలనీకి వారం రోజుల క్రితం తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె గ్రామం కొప్పలవారిపల్లెకు చెందిన దేవరింటి నరసింహారెడ్డి (41) అనే వ్యక్తి వచ్చాడు. ఇతనికి మతిస్థిమితం సరిగ్గా లేదు. కాలనీలో తిరుగుతూ వారు పెట్టే భోజనంతో కాలం వెళ్లదీసేవాడు. రాత్రి వేళలో కూడా కాలనీలో అటు ఇటు తిరిగేవాడు. మతిస్థిమితం లేని వ్యక్తిగా కాలనీ వాసులు భావించారు. కాలనీకి సమీపంలోని నిర్జన ప్రదేశంలో ఉన్న ఓ రూములో రాత్రి వేళ నిద్రించేవాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మూడన్నర గంటల ప్రాంతంలో కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్దకు వెళ్లాడు. స్కూల్ విరామ సమయంలో బయట ఉన్న విద్యార్థినులపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. 2వ తరగతి విద్యార్థిని వర్షిణి గొంతు పట్టుకుని పైకి లేపి చంపే ప్రయత్నం చేశాడు. చిన్నారి గట్టిగా అరవడంతో వదిలేశాడు. తర్వాత కొంత దూరంలో ఉన్న ప్రణతి, లహరి, రోహిత, రేణుక విద్యార్థునులపై దాడి చేశాడు. వారిని గాయపరిచాడు. వీరి చేతులకు, కాళ్లకు తేలికపాటి గాయాలయ్యాయి. వీరంతా ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నవారు. ఊహించని ఈ పరిణామంతో విద్యార్థినులు భీతావహులయ్యారు. భయంతో వణికిపోయారు. వారు గట్టిగా అరవడంతో కాలనీ వాసులు.. సైకోగా ప్రవర్తించిన నరసింహారెడ్డిని పట్టుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన కాలనీకి చేరుకున్న పోలీసులు ఇతన్ని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనపై ఎస్ఐ దిలీప్‌కుమార్ విద్యార్థినులను, తల్లిదండ్రులను, హెడ్మాస్టర్‌ను విచారణ చేశారు. అనంతరం కాలనీ నుంచి సైకోను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. పిల్లలపై దాడి చేసిన వాడిని ఊరికే వదల కూడదని పోలీస్ జీపును అడ్డుకున్నారు. చివరకు పోలీసులు కాలనీ వాసులకు నచ్చ చెప్పి అతన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హెడ్మాస్టర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ సంఘటన పరిసర ప్రాంతాల్లో కలకలాన్ని సృష్టించింది. కాలనీ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కాగా ఇతని విషయమై అతని స్వగ్రామం కొప్పలవారిపల్లె గ్రామస్తులను విచారించగా నరసింహారెడ్డికి మతి స్థిమితం లేదని రోడ్ల వెంబడి తిరుగుతుంటాడన్నారు. దీంతో భార్య కూడా పుట్టింటికి వెళ్లిపోయిందని, తల్లిదండ్రులు కూడా లేరని తెలిపారు. ఒంటరిగా కాలం వెల్లదీస్తున్నాడని పేర్కొన్నారు. తమ ప్రాంతంలో ఇతను ఇతరులపై దాడులకు పాల్పడిన దాఖలాలు గతంలో ఎప్పుడూ లేవని వివరించారు.



### 'మాకు తెలియకుండానే గ్రూప్ సభ్యత్వం రద్దు'

రాయచోటి టౌన్ : తమకు తెలియకుండానే పొదుపు సంఘం సభ్యత్వాన్ని రద్దు చేశారని రాయచోటి పట్టణం చౌడేశ్వరమ్మ ఆలయం వీధికి చెందిన మహిళలు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సుమారు 20 సంవత్సరాలుగా పొదుపు సంఘం సభ్యులుగా ఏర్పడి అనేక మార్లు రుణాలు కూడా పొందామన్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం రెడ్డెమ్మ, జ్యోతి అనే తమ గ్రూప్ సభ్యులు తమకు తెలియకుండానే గ్రూపును రద్దు పరిచి మరో గ్రూప్ ఏర్పాటు చేశారని తెలిపారు. తమ సంతకాలు లేకుండానే వారు ఎలా రద్దు పరుస్తారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

### 'తప్పుడు డాక్యుమెంట్లతో బెదిరిస్తున్నారు'

– ఓ మహిళ జేసీకి వినతి

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం మధిర గాలివీడుకు చెందిన షేక్ షంషాద్‌కు చెందిన భూమిని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అహ్మద్‌బాషా, జిలానీబాషాలు బెదిరిస్తున్నారని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌కు ఫిర్యాదు చేశారు. రాయచోటి కలెక్టరేట్ వద్ద ఫిర్యాది షేక్ షంషాద్ మాట్లాడుతూ తన భర్త మరణానంతరం తనకు సర్వే నెంబర్ 475లో 0.75 సెంట్ల భూమి తన అనుభవంలో ఉందన్నారు. కానీ గాలివీడుకు చెందిన మగ్బూల్‌బాషా కుమారులైన అహ్మద్‌బాషా, జిలానీబాషాలు పట్టా నెం .2077లో ఈ పాసుపుస్తకంలో ఫేక్ అగ్రిమెంట్ సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అంతేకాకుండా వారు మారణాయుధాలతో తమపై దాడులకు కూడా తెగబడుతున్నారని ఫిర్యాదులో తెలిపినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

### యువతి ఆత్మహత్య


నవ్య మృతదేహం

రాజంపేట : రాజంపేట రూరల్ ఏరియాలోని ఊటుకూరులో బోనం నవ్య (24) అనే అనే యువతి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి, తిరిగి వచ్చిన తల్లి.. నవ్యకు పెళ్లి సంబంధాలను చూడటం కొనసాగింది. తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీఆర్వోగా ఉద్యోగం చేస్తున్న నానమ్మ సంరక్షణలో నవ్య ఉండేది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని మన్నూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### నిర్ణీత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు.

## ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో చోటు

– జిల్లా కళాకారుడికి దక్కిన గౌరవం


పుస్తకాన్ని అందుకుంటున్న గిరిధర్


పుస్తకంలో గిరిధర్ చిత్రలేఖనం ఫొటోలు

రాజంపేట టౌన్ : విజయవాడకు చెందిన ప్రముఖ రచయిత కళాసాగర్ రాష్ట్రంలోని ప్రతిభ గల వివిధ చేతివృత్తి కళాకారులను గుర్తించి వారు రూపొందించిన ఫొటోలతో ఓ పుస్తకాన్ని తయారు చేశారు. ఈ పుస్తకంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ప్రముఖ చిత్ర కళాకారుడు నాయని గిరిధర్ వేసిన చిత్రలేఖనం ఫొటోలకు చోటు దక్కింది. ఈ పుస్తకాన్ని ఈనెల 10వ తేదీన విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు గిరిధర్ సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. కళాసాగర్ రెండేళ్లపాటు శ్రమించి రాష్ట్రంలో మూడు వందల మంది ప్రతిభ గల వివిధ చేతివృత్తి కళాకారులను గుర్తించి రూపొందించిన పుస్తకంలో తన చిత్రలేఖనం ఫొటోలకు చోటు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కళాకారుడికి ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో చోటు దక్కడం విశేషంగా చెప్పుకోవచ్చు.

# ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీ, ఆర్‌వీ నాయుడు కాలనీకి చెందిన రెడ్డప్ప భార్య భూదేవి (45) అక్టోబర్ 31వ తేదీన కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలతో ఎలుకల నివారణ మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం ఆరోగ్య పరిస్థితి మెరుగుపడతంతో డిశార్జ్ చేసి ఇంటికి పంపారు. రెండు రోజుల అనంతరం విషప్రభావం పెరిగి ఆరోగ్యం విషమించడంతో తిరిగి జిల్లా ఆస్పత్రికి రాగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అయితే కుటుంబ సభ్యులు బాధితురాలిని తిరుపతి, వేలూరు సీఎంసీ ఆస్పత్రులకు తరలించి చికిత్సలు చేయించారు. పరిస్థితి చేయి దాటడంతో ఆస్పత్రి వర్గాలు ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. శనివారం రాత్రి బాధితురాలిని తిరిగి జిల్లా ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం భూదేవి మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



## బింబం.. ప్రతిబింబం

ప్రకృతి సోయగం సందర్శకులను పరవశింపజేస్తోంది. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం మేదరపల్లి వద్ద రమణీయ దృశ్యాలు వారి మనసు దోచుకుంటున్నాయి. ఎంతో సుందరంగా ఉన్న రాళ్లు, చెట్లు అబ్బురపరుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గుంతల్లో నీరు చేరింది. ఆ నీటిలో రాళ్లు, చెట్లు, నీలిమేఘాల ప్రతిబింబాలను చూసి మైమరిచిపోతున్నారు. చిత్రకారులు గీసిన చిత్రాలుగా.. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి.

– మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



### రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

– మరో నలుగురికి గాయాలు


మృతి చెందిన నితిన్ కుమార్

రాయచోటి టౌన్ : పట్టణ పరిధిలోని రాయచోటి–గున్నికుంట రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం మండలం మన్నేరువాండ్లపల్లెకు చెందిన గరికిపాటి నితిన్ కుమార్(16) రాయచోటిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గున్నికుంట్ల రోడ్డులో ఉన్న తన మిత్రుడి వద్ద పుస్తకం కావాలని తన తమ్ముడు జశ్వంత్, చందు అనే మిత్రుడితో కలిసి స్కూటర్‌పై బయలుదేరారు. అదే సమయంలో రాయచోటి పట్టణానికి చెందిన అల్తాఫ్, ఖాదర్ హుస్సేన్ టీవీఎస్ ఎక్సెల్‌పై గున్నికుంట్ల రోడ్డులో నుంచి రాయచోటి టౌన్‌లోకి వస్తున్నారు. గవర్నర్ కల్యాణ మండపం సర్కిల్ వద్దకు రాగానే వీరి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో నితిన్ కుమార్ తీవ్రంగా గాయపడటంతో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం అందిస్తుండగానే మృతి చెందాడు. మిగిలిన నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న ఖాదర్ హుస్సేన్‌కు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన నలుగురిని రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.